# అచలపతీ - ఆధునికమాతా

**ఓ**ర్పు కావాలన్నిటికీ. రాబర్టు బ్రూస్ ఏడుసార్లు సాలిగూడు కట్టాడని ముళ్లపూడి రమణగారు చెప్పారు. ఓపిక పడితే 'మేనల్లుళ్లు అనేవాళ్లు తామే మసి పూసేసిన మాణిక్యాల'ని అత్తలు గుర్తించే 'వో సుబహ్ కభీతో ఆయేగీ' అని సాహిర్ రేడియో ద్వారా ధైర్యం చెబుతున్నప్పుడే –

"ఒరేయ్ బడుద్ధాయ్ (ఇది నా పేరు కాదు, విశేషణం! ఇక్కడ సంబోధన ప్రథమా విభక్తిగా వాడబడింది.) నువ్వు నాకు ఉపకారం చేయాలి. మా ఆడపడుచు కొడుకుని పైకి తీసుకురావాలి!" అంది మాంకాళి అత్తయ్యొచ్చి.

స్టేషన్ మార్చి చూసా 'కాదు సుమా, కల కాదు సుమా' అని ఘంటసాల హామీ ఇచ్చేడు.

"అచలపతి ఊళ్లోనే ఉన్నాడు " అన్నాను కచ్చగా.

"దెప్పకోయ్. ఈ మధ్య షేరు మార్కెట్ విషయంలో ఉషకు సలహాలిచ్చావటగా (తక్కినవి చదవకపోయినా నా 'భాగవిపణి' కథ మాత్రం చదవండి) ఎంతైనా రక్తబంధువులం. నా తెలివితేటలు కొన్ని అబ్బి వుంటాయి".

"మరి దాంతోబాటు వచ్చిన తెలివితక్కువతనం ఎక్కడిదో ?"

"ఉష పోలిక అయి వుంటుంది. ఆ మేనత్త పోలిక కూడా కాస్త వస్తుందిగా. సర్లే, అవన్నీ పక్కకు పెట్టు. మా బంటూ భారం నీదేనని చెప్పడానికి వచ్చాను".

"మా చిన్నప్పుడు జీడికి బంటెవరని అడిగేవారు. ఈ బంటుకి రాజెవరు?"

"రాజూ, రాణీ, దైవం, దెయ్యం అన్నీ వాళ్లమ్మే. అంటే మా ఆడపడుచు. తన కొడుకుని అరవై నాలుగు కళల్లోనూ నెంబర్‌వన్‌గా నిలబెట్టాలని ఆవిడ కలవరిస్తోంది. మొగుడి మాట తోసిపారేసి ఈ ఊళ్లో ఉన్న రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించింది. గార్డియన్‌గా నిన్ను పెట్టమన్నాను".

రేడియో కట్టేశాను. ఇంతకంటే చెవుల కింపైన సంగీతం ఎవరివ్వగలరు? ఆ ఇంపైన సంగీతం 'మేల్ వాయిస్'లో కూడా విందామని అత్తయ్య వెళ్లిపోయాక అచలపతికి చెప్పి 'అత్తయ్యకు నా మీదున్న నమ్మకానికి ఆశ్చర్యం వేసిందోయ్' అనే వినయం రంగుకూడా రంగరించాను.

రంగు ఎక్కువైనట్టుంది "నాకూ ఆశ్చర్యంగానే ఉంది సార్" అంది 'యువర్స్ మోస్ట్ ఒబీడియంట్లీ' వాయిస్.

కొన్ని విషయాల్లో ఎదుటివాడు ఏకీభవించక పోతే బాగుంటుంది. ఇంకొక ఛాన్సిచ్చి చూద్దామనుకున్నాను–

"నేను జీతం ఇస్తున్నాను కదాని నేనన్న ప్రతిదానికీ తందానతాన అనక్కర్లేదు. నీ అభిప్రాయం స్పష్టంగా చెప్పు".

"మీ అత్తయ్యగారు తన ఆడపడుచు బిడ్డ భవిష్యత్తును మీ చేతిలో పెట్టిందంటే వదిన – ఆడపడుచుల మధ్య వైషమ్యం ఎంత దూరం పోయిందో తెలుస్తోంది సర్".

లింకు అందలేదు. మాలతీచందూర్ జవాబులా తోచింది. పోన్లే ఎంతో, కొంత ఆడపడుచుల గురించి విజ్ఞానం సముపార్జించాను కదాని సరిపెట్టుకుని, "బంటూని స్టడీ చేయాలి" అన్నాను ఉపోద్ఘాతంగా.

"అంతకంటే ముందు వాళ్లమ్మగారిని స్టడీ చేస్తున్నారా, సర్?" తెలీనట్టు అడిగేడు.

"వాళ్లమ్మ మన క్లయింట్ కాదే. అయినా స్టడీ చేయడానికి ఏముంది?"

"అంటే ఆవిడకూడా బంటూ వయస్సులో ఆటల్లో, పాటల్లో, చదువులో, సాంస్కృతిక కార్యక్రమాల్లో ముందుండే వారా అన్న విషయం విచారించారా..?"

"... రించక్కర్లేదు. నాకు తెలుసు. ఈవిడా మోడన్ మదరే. ఆధునిక మాత. గతం గురించి గట్టిగా అడిగితే 'మా అమ్మా నాన్నా డబ్బుకి కక్కుర్తి పడ్డారు. గుర్రబ్బండి ఎక్కించారు కానీ గుర్రపు స్వారీ నేర్పించలేదు. పక్కన కూర్చోబెట్టి చదువు చెప్పారు కానీ ప్రత్యేకంగా స్టడీ రూము ఏర్పాటు చేయలేదు. అందుచేత నెంబరు వన్లు కాలేకపోయాం. ఇప్పుడు మేం డబ్బు వెదజల్లినప్పుడు మా పిల్లలు ఫస్టు రాకపోతే ఎలా?' అంటారు. అందువల్ల బంటూనే స్టడీ చేయాలి".

"అంటే అతని శక్తి సామర్థ్యాలు అంచనా వేయటంతో బాటు ఇష్టాయిష్టాలు కూడా కనుక్కొంటారా సర్ ?"

"ఇది వాళ్లమ్మకూ, నాకూ ప్రెస్టేజి క్వశ్చను, వాడు నా పాలబడ్డాడు. పాల ముంచడమే

మన ధర్మం. ఎంత ఖర్చైనా సరే వాడిని నంబర్ వన్‌గా నిలబెడతాను. ఇందులో వాడి అభిప్రాయాలకు అంగుళమైనా తావు లేదు. ఆ పిల్ల కాయ, మా దృష్టిలో ఇంకా పిందె మాత్రమే".

"ఎంతైనా తన జీవితాన్ని తనకు నచ్చిన విధంగా మలచుకునే హక్కు ప్రతీ ప్రాణికీ ఉంది కదా".

"ఎవరిదా కొటేషన్?"

"ప్రస్తుతానికి నాదేనండి. మీరు కోరితే కాపీరైట్ మీ కిచ్చేస్తాను".

"నో, థ్యాంక్స్. ప్రాస అంత బాగా కుదరలేదు. ఆ అబ్బాయి పెళ్లాడి, పిల్లలు కన్నాక వాళ్లమీద తన ముచ్చట తీర్చుకోవచ్చు. అంతదాకా వాడు వద్దంటున్నా మనం రెక్కట్టుకుని జీవితంలో పైకి లాక్కురావల్సిందే. నేను ఓ జబ్బ పట్టుకుంటే నువ్వు మరో జబ్బ పట్టుకోవాలి".

"మీ సేవలో సర్వదా సిద్ధం సర్!"

నేనీ పనికి ఒప్పుకొన్నప్పుడు మాంకాళి అత్తయ్య మెప్పు తప్ప మరేదీ ఎదురు చూడలేదు. కానీ తన ఆడపడుచు, అంటే బంటూ తల్లిని చూసినప్పుడు ఈ నిర్ణయాన్ని తీసుకొన్నందుకు నా వీపు నేను తట్టుకొన్నాను. చెయ్యి కొంచెం నెప్పి పుట్టినా సరేనని.

ఆవిడకు మనుష్యుల విలువ తెలుసు. నా దగ్గరకి బంటూని ఎంత ఇదిగా హడలేసి తీసుకొచ్చిందంటే నేను కాస్త తృప్తి కనబరిస్తే చాలు, బంటూ టెన్సింగు నార్కే మార్కు నవ్వు నవ్వుతున్నాడు. 'ఆడ్మిషన్ టైములో ప్రిన్సిపాల్ భోగం' అన్న రాజయోగానికి అర్థం తెలిసి వచ్చింది నాకు.

బంటూ మాత్రం నాకంతగా నచ్చలేదు. మనిషిలో ఏదో లోపం ఉన్నట్టుంది. బయట నుండి మద్దతు పొందుతున్న ప్రధానమంత్రిలా కుర్చీ అంచున కూచున్నాడు. యజమాని విసిరిన బంతిని తెచ్చి పడేసి మళ్లీ మూలకెళ్లి కూర్చుందామని చూస్తున్న కుక్కపిల్లలా దిక్కులు చూస్తున్నాడు. ఏదైనా అడగ్గానే పనస అందుకున్నట్టు గడగడా అప్పచెప్పడం, వాళ్లమ్మ కేసి చూడటం, ఆ తర్వాత బుస్సుమని నిట్టూర్చి కుర్చీలో వాలడం. ఒక వేళ తల్లి కనుబొమ్మలు ముడివేస్తే జడ్జీచేత చివాట్లు తిన్న సిబిఐ డైరెక్టరులా ముడుచుకు కూచోవడం – ఇదీ పద్ధతి.

పాపం తల్లి, నా బోటివాడి విలువ తెలిసినావిడ! తల్లిపార్టీ లోంచి తను బయటకు ఎందుకు రావలిసి వచ్చిందో వివరించబూనిన రాజకీయ నాయకుడిలా బంటూ ప్రస్తుత

పరిస్థితికి కారణాలు అతికష్టంమీద చెప్పబోయింది.

అరవై నాలుగు కళల్లో కొడుకు 'హా'రి తేరాలని ఆ అరవై నాలుగింటికి సంబంధించిన గురువులు, లేదా సంస్థల గురించి వాకబు చేయడం, మార్కెట్టు రిపోర్టులు బేరీజు వేయడం, వాళ్ల పాత విద్యార్థులను కలిసి ఇంటర్వ్యూ చేసి వాళ్ల స్థాయిని అంచనా వేయడం, ఈ రంగాలకు భవిష్యత్తులో కలగబోయే ప్రాముఖ్యత గురించి మేధావులను సంప్రదించడం, ఫీజుల విషయంలో డిస్కౌంటు వివరాలు తెలుసుకొని బేరసారాలాడటం– వీటన్నిటివల్లా ఆమెకు బంటూని కలిసి మాట్లాడడానికి సమయం చిక్కటం లేదుట. లేకపోతే ఇంకా మంచి ట్రైనింగ్ యిచ్చాకనే మీ దగ్గరికి తీసుకొచ్చేదాన్నంది.

"కష్టజీవులంటే నాకు ముచ్చటోయ్. అంతా నాలాగే ఉందామని చూస్తే దేశ మేలాగు బాగుపడునోయ్?" వాళ్లు వెళ్లిపోయేక అచలపతితో అన్నాను.

"అంటే మీరు తల్లిపక్షమే వహించి మీ ముచ్చట కోసం కుర్రాడిని కష్టాలపాలు చేసి.." అనబోయేడు అచలపతి.

"...యస్, సురేంద్రనాథ్ బెనర్జీ అంతటివాణ్ణి లేదా నా అంతటివాణ్ని చేసి తీరుతానని ఇందుమూలంగా ఉద్ఘాటిస్తున్నాను".

"కుర్రవాని శ్రేయోభిలాషిగా మీ ప్రయత్నాలలో నా వంతు పాత్ర ఎప్పుడూ ఉంటుందనీ నేను కూడా నొక్కి వక్కాణించ వచ్చునా, సర్"

నా అంత పరిశీలనాశక్తి లేకపోయినా మీరూ గమనించే ఉంటారు– 'లోకంలో ఏ పనైనా న్యాయమార్గంలోనే చెయ్యాలి' అని నీతులు చెప్పేవాళ్లు సాధారణంగా పడక్కుర్చీలోనే నివసిస్తూ ఉంటారు. కార్యరంగంలో దూకినవారు కుడీ –ఎడమా, మంచీ–చెడూ ఇవన్నీ పట్టించుకుంటూ కూచుంటే కాలుసాగదు, చేయి ఆడదు. 'ప్రేమలోను, యుద్ధంలోను ఏం చేసినా మా బాగే', అన్నాడు తెల్లవాడు. మన నల్లనయ్య కూడా అర్జునుడికి అదే చెప్పాడు – 'నువ్వు చేసేయ్ . నా మీదకి తోసేయ్' అని. జీవితాన్ని నిరంతర యుద్ధంగా అనేసుకుంటే చాలు, మన పన్లన్నీ 'ఫెయిర్' అయిపోతాయి. అవి అచలపతికి 'లవ్లీ'గా ఉండకపోతే అది అతని ఖర్మ!

బంటూ స్కూల్లో చేరిన నెల్లాళ్లలోనే పెట్టిన వ్యాసరచన పోటీల్లో పోటీల్ని నిర్వహించే మేష్టారికి పళ్లబుట్ట ఇచ్చి సబ్జక్ట్ ఏమిటో ముందుగానే కనుక్కురమ్మన్నప్పుడు అచలపతి

మొఖానికీ, అంబాజీ పేటకూ సంబంధం ఉందనిపించింది.

"బంటూ తన స్వయంప్రతిభతోనే వెలుగొందే అవకాశం ఉందేమో పరిశీలించిన తర్వాతనే మన వంతు ప్రయత్నం మలిసారికి చేసి చూడవచ్చని నేను సూచించవచ్చునా సర్?" శశికళతో సంబంధం వదులుకోమని జయలలితను అడిగిన ఏడీఎమ్కే కార్యకర్తలా బెరుగ్గా అడిగేడు అచలపతి.

"అంత టైము లేదు. స్కూల్లో చేరగానే మొదటి పరీక్ష ఇది. ఛాన్సులు తీసుకునే ఛాన్సు లేదు. అతను ఫస్టు వచ్చి తీరాలి. తల్లి నన్ను మెచ్చి తీరాలి. ప్రాస కుదిరింది కదూ... అంటే మనం రైట్ ట్రాక్‌లో ఉన్నట్టన్నమాట".

అదెందుకు పుడుతుందో గానీ ఒక్కొక్కప్పుడు సినీనటీనటులు ఉన్న భవంతులు వదిలేసి పాత్రల్లో జీవించడం మొదలెడతారు. అప్పుడు ఏ రెమ్యూనరేషన్ లేకుండా ఆ పాత్రల్ని నిజ జీవితంలో అద్భుతంగా పోషిస్తున్నవాళ్ల దగ్గరి కెళ్లి, గమనించి, వాళ్ల హావభావాలు తెరపై కాపీ కొట్టేస్తుంటారు.

మెడలు వంచైనా మెడలు ఇద్దామని వచ్చిన సేనాపతితో 'కురుక్షేత్రం దారి మర్చిపోయాన్సార్' అని చెప్పే సైనికుడి పాత్రలో జీవించదలచిన నటుడు ఆవేళ, నేను 'వ్యాసరచనా వ్యాసంగ ప్రవీణ' బిరుదు పట్టుకుని బంటూ దగ్గరికెళ్లినప్పుడు నాతో వచ్చి ఉండాల్సింది.

వెళ్లగానే అడిగేశా. "నోట్లో ఏముంది? పుచ్చు బఠాణీయా ?" అని. కాదన్నాడు.

"ఆఖరి వేరుశెనక్కాయా?" (అదేమిటో గానీ ఆఖరి దెప్పుడూ చేదుగానే ఉంటుంది) కాదన్నాడు.

విషయం ఏమిటో చెప్పేడవమన్నాను. ఏడ్చి చెప్పినా ఫర్వాలేదు. టైముంది వెయిట్ చేస్తానన్నాను.

రెండూ కాకుండా ఏడుస్తూ చెప్పాడు–

అచలపతి చెప్పిన టాపిక్ రాలేదుట. కంగారుపడి ఏదీ రాయకుండా వచ్చేశాడుట.

ద్రోణాచార్యుల కాలం నుంచీ ఉపాధ్యాయులలో తరుగుతూ వస్తున్న నైతిక విలువల గురించీ, ఉప్పు తినిపించినవాళ్లకి తప్ప తక్కినవి తినిపించిన వాళ్లందరికీ ద్రోహం చేసినా తప్పు లేదనే ధోరణిలో ప్రవచనాలు వల్లించిన మన పెద్దవాళ్ల ధోరణి గురించీ నేను ఆ సాయంత్రం ఉపన్యసిస్తూంటే అచలపతి అడ్డుపడ్డాడు.

"బంటూతో మాట్లాడిన తర్వాత నాకు గుర్తొచ్చింది సర్. టీచర్ టాపిక్ కరెక్టుగానే

చెప్పారు. అది మనస్సులో అనుకుంటూ వస్తూండగా 'భారతీయుడు' పోస్టర్ కనబడి, మనసు అటువైపు మళ్లి 'లంచగొండితనమే' టాపిక్ అనుకొని పొరబడ్డాను సార్".

"ఇంకానయం! ఆయనకి ఇచ్చివచ్చిన 'పళ్లబుట్ట' అనుకొన్నావు కాదు. అయినా ఇలా పొరబడడం గురించి చిన్నప్పుడో కథ చదివేనోయ్. నువ్వది కాపీ కొట్టటం లేదు కదా!?"

"లేదు సర్, ఇది నా ఒరిజినల్ కన్ఫ్యూజన్."

"యూమీన్, ఒరిజనల్లీ ఒరిజినల్? 'జగమేమాయ'లో ఘంటసాల దగ్గంత?"

"అ ...ఖ ..ఖ్క.. రాలా" అన్నాడు అచలపతి మర్యాదకి కాస్త దగ్గుతూ.

ఈత పోటీలు జరిగిన మర్నాడు నేను బంటూ దగ్గరికి బిరుదు పట్టుకొని వెళ్లలేదు. ఈతకు సంస్కృత పదం తెలియలేదు. సంస్కృతపదం లేకపోతే బిరుదుకు గాంభీర్యం రాదు. వెళ్లగానే అడిగేను.

"చాకోబార్ కొరగ్గానే బార్ పడిపోయి పుల్ల మిగిలిందా?"

"లేదు అంకుల్"

"మరి మొఖం అలా పెట్టావేం?"

"స్విమ్మింగ్ పోటీల్లో నాకు ఫస్టు ప్రైజు రావాలని మీరు ఫైవ్‌స్టారు హోటల్లో బాగా ప్రాక్టీసు చేయించారు గదా అంకుల్! ప్రాక్టీసులో స్విమ్మింగ్ డ్రస్సు పాడయిపోయింది. పోటీకి కొత్త డ్రస్సు కొనిపెడతానని అచలపతి అంకుల్ చెప్పారు. ఆఖరి నిమిషంలో తెచ్చిన డ్రస్సు చాలా చిన్న సైజుది. సైజు సరిగ్గా తెలియలేదుట. అది వేసుకుని పోటీలో పాల్గొనడానికి సిగ్గేసి మొత్తానికి మానేశా అంకుల్".

"అదేమిటి బంటూ, అంత సిగ్గెందుకు?" అన్నాక స్విమ్మింగ్ సూట్ పరిశీలించి చూశా. పోటీలో గళ్ స్టూడెంట్లూ ఉన్నారన్న విషయం, ఈ సూట్ మరీ చిన్నదిగా ఉందన్న విషయం పరిగణనలోకి తీసుకుంటే బంటూ చేసిన పని సమంజసంగా తోచింది.

కానీ బంటూ తల్లికి అలా తోచలేదు. ఫోన్లో ఆవిడ బుద్ధి కాస్త నాకిచ్చింది. (ఈవాక్యం అర్థం కాకపోయినా ముందుకు సాగండి. అంతే తప్ప ఇంగ్లీషులో తర్జుమా చేసి చూడకండి) రాబోయే క్వార్టర్లీ పరీక్షల్లో ఫస్టు మార్కు బంటూకి తెప్పిస్తానని 'కామరాజ్ పాలన తిరిగి తెస్తామని ప్రతిజ్ఞ చేసే తమిళ కాంగ్రెసువాది'లా ప్రతిజ్ఞ చేసి పడేసాను. అచలపతిని కదలేశాను –

"బంటూ చేత కాపీ కొట్టించాలోయ్....."

"...కొట్టే నేర్పు అతని కుందా సార్?"

"...లేకపోతే నేర్పాలి. నేర్పిస్తే మంచిది. ఏదీ కలిసి రాకపోయినా పెద్దయ్యాక తెలుగు నవలా రచయితైనా అవుతాడు. కాపీకి సహకరించే వాచర్ గురించి వాకబు చెయ్యి".

రెండు రోజుల్లో సమాచారం సిద్ధం.

"ఉన్నారు సార్. చండశాసనరావు అనే ఒక టీచర్.."

"ఆగాగు, అచ్చు తప్పు పడ్డట్టుంది. ఆ పేరు గల వ్యక్తులు అలాటి పన్లు..."

"సర్... పరంధామయ్య అనే వ్యక్తి పుట్టినప్పుడే ముసలివాడిగా పుట్టడని ఈ సందర్భంలో గుర్తుకు తెచ్చుకోవాలి సర్. అతని యౌవన దశలోకూడా అతని పేరు పరంధామయ్యగానే ఉండి ఉంటుందని మనం మరువకూడదు.."

"పాయింట్ నోటెడ్.. ఇంతకీ ఈయన రేటెంత?"

"చూసీ చూడనట్లు వదిలేయడమా? కాపీలిచ్చి సహకరించడమా? అన్న అంశంపై ఫీజు ఆధారపడి వుంటుందిట సార్".

"సరే బేరసారాలు నా కొదిలేయ్"

ప్రతీ మనిషికీ ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతుంటాయి. కొద్దిసేపట్లో అరెస్టు చేయించబోయే ఎంపీ వద్దకు మద్దతు కోరడానికి వెళ్లవలసిన సంకట పరిస్థితులను కూడా ప్రధానమంత్రులు ఎదుర్కోవలసివస్తోంది. 'చట్టం దాని దారి అది చూసుకొంటుంది,' అని వాళ్లు మనకు నచ్చబెబుతారనుకోండి. అంటే 'చట్టం దారి చట్టందే, మీరు పడి పోయే దారి మీదేనన్నమాట' అని పేపరు కొత్తగా చదువుకునే వాళ్లు అనుకొంటారు గానీ పైకనరు. అనకపోయినా మంత్రిగారి ఇబ్బంది ఇబ్బందే కదా!

ఆరంజికోటు వ్యవహారంలో నేనొక వేశ్య మొహాన డబ్బు కొట్టి మావాడు రాసిన ఉత్తరాలు తేవడానికి వెళ్లినప్పుడు కూడా ఇటువంటి అనీజీనెస్సే ఫీలయ్యేను. రైల్వే టి.టి.ఇ. ఎక్కడికి వెళితే అక్కడికి వెంటపడిపోయే గుంపులో మీరు ఓ గోవిందయ్య అయితే, లంచం ఇవ్వజూపడం ఎంత కష్టమో మీరు అర్థం చేసుకుంటారు.

నేను భయపడినంతా అయ్యింది. చండశాసనరావుగారు చండామార్కుల్లా మండిపడ్డారు. 'నేను లంచగొండినని ఏ పుండాకోర్ చెప్పాడో చెప్పమన్నా'రు. నాకు శిక్షగా బంటూని ఈసారి పరీక్షల నుంచి డిబార్ చేస్తానన్నారు; చేశారు.

ఈసారి బంటూ, తల్లి తన  బుద్ధిలోంచి పెద్ద ముక్కే ఇచ్చింది నాకు. ఇలా అయితే ఆవిడ దగ్గిర  ఏం మిగిలేను?

"అచలపతీ, నువ్వు చేసిన పని ముదావహంగా లేదనీ, నీ తీరును  అభిశంసిస్తున్నాననీ, కారణం కోసం నిన్ను నేను ఇందుమూలంగా నిలదీస్తున్నాను".  అన్నాను గంభీరంగా.

"నేను నిలబడే ఉన్నాను,  సర్" అంది  నిటారుగా ఉన్న విగ్రహం.

"నీ ఏంటెనా  సరిగ్గా  సిగ్నల్స్ అందుకోలేదా?"

"సర్, నేను దరిమిలా  కనుక్కొన్నాను – మీరు  వెళ్లే సమయానికి  ఏంటి కరప్షన్ బ్యూరో  వ్యక్తి మాటువేసి  ఉన్నాడు. అందుకే  ఆయన ఆలా ప్రవర్తించాడు".

"నా కెవరూ  కనబడలేదే!"

"సర్, అందరికీ  తెలిసేట్లా గూఢచారులు  మసలరు కదా!"

"మరి చండశాసనరావుకి తెలిసిందే!"

"అతను టార్గెట్  కాబట్టి  తెలిసింది".

"ఓహోఁ!  గూఢచారి ఉన్నాడని బయట వాళ్లకెవరికీ  తెలియదు. కానీ ఎవర్ని పట్టుకోబోతున్నారో వాళ్లకి మాత్రం తెలుస్తుంది. అంతేనా!  అర్థమయినట్టే  ఉంది కానీ అర్థం కావటం లేదు. ఏమిటో  కాస్త తికమకగా  ఉంది  కదూ! దేశమంతా  పార్టీల మధ్య ఎన్నికల  ఒప్పందం. కొన్ని రాష్ట్రాల్లో మాత్రం 'ఫ్రెండ్లీ' కాంటెస్టులు' అన్నట్టుంది కదూ!"

"తికమక ఏమీ లేదు సర్.  రెయిడ్  చేసేవాళ్ల  వ్యవహారమే అంత సార్.  ఇది వదిలేయండి.  పై సారికి చూడండి".

పై సారి  నాటకాల పోటీలో  బంటూ విజయానికి అన్ని ఏర్పాట్లు  చేసి ఆ రోజు ఊరు వెళ్లాల్సివచ్చి,  మర్నాడుదయమే బంటూని కలిశా.

"ఎందుకా షేక్స్పియర్ ముఖం?  నిన్న రాత్రి నాటకంలో వెంకటేశం  పాత్ర వేసావా?'

"ఏ పాత్రా వేయలేదంకుల్. మా ముందు అయిటమ్‌లో గలభా జరిగి  ప్రోగ్రాంలన్నీ కేన్సిల్  చేసేశారు".

"గలభా  అంటే  అరటి తొక్కలూ, కోడి గుడ్లూనన్నమాట. అందుకొన్న ఆ భాగ్యశాలి ఎవరు?".

"ప్రిన్సిపాల్‌గారమ్మాయి. ఆ అమ్మాయి  భరతనాట్యం రెండోసారి చెయ్యడం ఎవ్వరికీ

నచ్చలేదంకుల్".

"నచ్చకపోతే మాత్రం కాస్త ఓర్చుకోవద్దూ?"

"అదికాదు అంకుల్. 'టేకిట్ ఈజీ ఊర్వశీ' డాన్స్ ఉంటుందని మైకులో ఎనౌన్స్ చేసి భరత నాట్యం రిపీట్ చేయడంతో స్టూడెంట్సుకి కోపం వచ్చింది".

"రిపీటెందుకు చేశారయ్యా బాబూ?"

"అచలపతి అంకుల్ వచ్చి 'నాట్యం బాగుంది వన్స్‌మోర్ చేయమంటే ప్రిన్సిపాల్ సంతోషపడి 'అలాగే తప్పకుండా' అంటూ వాళ్లమ్మాయి చేత మళ్లీ డాన్స్ చేయించారు".

అదన్న మాట సంగతి! 'టేకిట్ ఈజీ' పాటకి డాన్స్ చేద్దామని శరీరాల్ని ఏ కీలు కా కీలు ఊడదీసి సిద్ధంగా పెట్టుకున్న కుర్రకారు ప్రోగ్రాంలో మార్పును ఈజీగా తీసుకోలేక పోయారన్నమాట. మరి బంటూ తల్లి ఏ విధంగా తీసుకొంటుందో?

ఆవిడా ఈజీగా తీసుకోలేదు. అందరికంటే ముందు బంటూ ప్రోగ్రాం పెట్టించి ఉండాల్సిందని కేకలేసింది. ఇప్పటివరకూ ఏ పోటీల్లోనూ పాల్గొని తన సత్తా చూపించే అవకాశం తన కొడుక్కి లేకపోయిందని వాపోయింది. ఆంధ్రలో ఇక కరంటు కోత ఉండదని 'కోతలు' కోసే కొత్త విద్యుచ్ఛాఖామాత్యుల్లా బంటూ విషయంలో ఏ లోపం జరగదని వాగ్దానం చేసాను.

గంభీరంగా ఉంటుంది కదాని మనం అప్పుడప్పుడు ఏవేవో అంటూంటాం. కానీ తథాస్తు దేవతలు యథాతథంగా వాటిని అమలు పరుస్తారని ఊహించం. "ఈసారి రన్నింగ్ రేస్ నీకూ, నాకూ జీవన్మరణ సమస్యోయ్' అని నేను బంటూతో అన్నప్పుడు డాక్టరు చేతిలో అతనికీ, అతని తల్లి చేతిలో నాకూ అది జీవన్మరణ సమస్య అవుతుందని నాకు తెలియదు.

అప్పటికీ ఆవిడకి చెప్పబోయేను – ఈసారి రన్నింగ్ రేస్‌లో బంటూ ఫస్టు రావాలనే సదుద్దేశ్యంతోనే నేను స్వయంగా డాక్టర్‌తో మాట్లాడి స్పెషల్ మందులు తెప్పించాననీ, ప్రిస్క్రిప్షన్‌లో ఉన్న ప్రకారం నేనే మందులు వేశాననీ చెప్పాను. కుర్రవాడు ఎందుకోగానీ పోటీనాడు పొద్దున్నే సొమ్మసిల్లి పడిపోయాడనీ, హాస్టల్ వార్డెన్ అనవసరంగా కంగారుపడి మిమ్మల్ని రప్పించాడనీ కూడా నచ్చ చెప్పాను. డాక్టరుగారు రాసిన డోసేజీ 0–1–0లో రెండో హైఫన్ నీళ్లు పడి చెరిగిపోవడంతో రాత్రి పది మాత్రలు నేను అజ్ఞానంతోనే వేసాననీ, అయినా సాయంత్రాని కల్లా తేరుకుంటాడనీ కూడా

బ్రతిమాలేను.

అయినా ఆవిడ వినందే! తమ పార్టీ రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దుచేసిన ప్రధాన మంత్రిపై విరుచుకుపడే అపోజిషన్ నాయకుడిలా నన్ను చచ్చేటన్ని తిట్లు తిట్టి, తిట్టి సొమ్మసిల్లి పడిపోయింది.

దానివల్ల జరిగిన మేలేమిటంటే డాక్టర్లు కుర్రాణ్ణి వదిలేసి తల్లి మీద పడ్డారు. అన్ని పరీక్షలూ జరిపి ఆవిడ హిస్టీరియా రోగి అని నిర్ధారించారు. హిస్టీరియా వల్లనే ఆవిడ తను బెదిరిపోయి, కొడుకుని బెదరగొట్టిందనీ, ఆవిడ రోగం కుదిరితే కుర్రాడు బెరుకుతనం పోయి మామూలుగా మారి చదువూ, సంధ్యా చూసుకుంటాడనీ డాక్టర్లు చెప్పారు.



ఆవిడ ఇవన్నీ తలకెక్కించుకొందో లేదో తెలీదుకానీ 'మా కుర్రాడు జీవితంలో ఊహు పై కొచ్చినా రాకపోయినా మా దగ్గిర ఉంటే చాలు' నంటూ బంటూని తరలించుకు పోయింది. పోతూ, పోతూ 'చూసి రమ్మంటే కాల్చి రాని హనుమంతుల వార్ని రామ చంద్రుడు చూసిన'ట్టుగా నాపై ఓ చూపు పారేసి వెళ్లింది.

''బంటూ, నీ ముఖంమీద ఇన్నాళ్లకు చిరు నవ్వు చూసానోయ్'' అంటే

'జ్యోతిబసుయే నవ్వగా లేంది నేను నవ్వలేనా' అన్నట్టు ఓ చిరునవ్వు చిలకరించాడు. అమ్మ అటక మీద దాచేసిన మాయాదీపం మళ్లీ కంటబడ్డ అలాదీన్ కనబడ్డాడు అతనిలో.

"మనకు గార్డియన్‌షిప్ భారం తగ్గిందన్న సంతోషంతో ఆనంద బాష్పాలు ఉబికి ఉబికి వస్తున్నాయోయ్ అచలపతీ. ముఖ్యమంత్రి పదవి పోతే పోయింది కానీ రాజశేఖర్‌రెడ్డి బాధ తప్పిందని సంతోషించే ఆంధ్ర కాంగ్రెసు ముఖ్యమంత్రిలా మనసు తేలిక పడిందోయ్" అన్నాను బంటూని రైలెక్కించి వచ్చి.

"మీకీ ఘట్టం రాబోతోందని ఆనాడే నాకు తెలిసి ఆనంద బాష్పాలూరి ఆ ప్రిస్క్రిప్షన్ కాగితం మీదపడి హైఫన్ చెరిగిపోయింది సర్" అన్నాడు అచలపతి ఏ భావం కనబరచకుండా.

'హమ్మా! ప్రిస్క్రిప్షన్ డోసేజి మార్చినది అచలపతా?' అని విస్తుపోయేంతలో –

"బంటూకి ఏ ముప్పూ రాదని ముందే కనుకొన్నాను సార్" అంది వెళ్లిపోతున్న అచలపతి వీపు.

అయితే మాత్రం? ఆ వీపుని వెనక్కి తిప్పి 'అయితే మాత్రం' అందామనుకొన్నాను.

'నేనెప్పుడో చెప్పాను కదా సార్! ట్రీట్ మెంటు అవసరం ఉన్నది ఆధునిక మాతకనీ, ఆ అర్భకుడికి కాదనీ' అంటాడేమోనని భయపడి ఊరుకున్నాను. కానీ రేడియో ఊరుకోలేదు.

'చెబితే వింటివ గురూ గురూ' –పాట పాడుతోంది.

